# ప్రయోగ ఫలాలు

"ఏం నాయుడూ.... సరిగా తెల్లారనే లేదు... అప్పుడే తోట కాడికి వచ్చేసినావే?"

తలొంచుకొని చెరుకుతోటకు నీళ్ళు కడుతున్న సురేంద్రనాయుడు ఉలికిపాటుగా తలెత్తి చూశాడు. ఎదురుగా నిలువెత్తు విగ్రహంలా జయచంద్రారెడ్డి. పసిమి మేనిచాయ, పొడవుకు తగిన లావు, ఎర్రఅంచు వున్న పంచె మీద పొడవు చేతుల తెల్లచొక్కా వేసుకొన్నాడు. భుజంమీద టవల్‌తో అలసిపోయిన పెళ్ళికొడుకులా వున్న అతన్తో-

"బాగుండావాన్నా.... నిన్ను చూడనేలేదు" అంటూ దగ్గరకు వచ్చాడు సురేంద్రనాయుడు.

జయచంద్రారెడ్డి పక్కన సురేంద్రనాయుడు మరుగుజ్జులా ఉన్నాడు. ఐదడుగుల పొడవు. నలుపు. నిత్య శ్రమతో మంచి ఆహారంతో బలిష్టంగా ఉన్నాడు. అతను కట్టుకున్న పంచె కావుతేలింది. వేసుకున్న బనీను మాసిపోవడంతో దాని అసలు రంగు ఏదో గుర్తు పట్టలేని విధంగా ఉంది.

వెలుగు తెరచాప పరుచుకుంటోంది. సూర్యుడు తూర్పున ఎర్రకొండ చాటునుంచి, భూమిని చీల్చుకువచ్చే విత్తనపు మొలకలా మెల్లమెల్లగా మబ్బుల తొలగించుకొంటూ పైకి వస్తున్నాడు.

జయచంద్రారెడ్డి సరేంద్రనాయుడి భుజంమీద చేయి వేస్తూ, "తోటలో చెరుకు సుడులు ఎండిపోతాండాయే, చూడలేదా" అడిగాడు తోటంతా కలయచూస్తూ.

"నేను చూసి రెండు దినాలయింది. నిరుడు బాగానే ఉన్నింది. ఈసారే ఈమాదిర్తో అయితాండేది. నిన్ను పిల్చుకోనొచ్చి చూపించాలనుకొంటి నువ్వే వచ్చేసినావు" అన్నాడు సురేంద్రనాయుడు.

జయచంద్రారెడ్డి తోటలో అటూ ఇటూ తిరిగాడు. ఒక చెరుకు కొస పట్టి లాగాడు. అది సులువుగా అతని చేతికొచ్చింది.

"చూసినావా నాయుడూ... ఇదెంత సులువుగా చేతికొచ్చిందో దీన్ని పీక పురుగు రోగం అంటారు. నేను చెరుకు ఏసినప్పుడు ఒకసారి ఇట్లే అయింది. అప్పుడు నాక్కూడా తెలీదు దీనిగురించి. టౌనుకు పొయ్యి వ్యవసాయానికి సంబంధించిన ఆఫీసర్నడిగి కనుక్కొంటి. 'లద్దెపురుగు' అని, చెరుకు గెడెలల్లో చేరతాదంట. చేరినాంక గెనుపులదగ్గర తినేస్తాదంట. మల్లేముంటాది. గెనుపుకు పైనుండేదంతా ఎండిపోతాది"

"అట్లయితే ఇంగెట్లన్నా!?" అడిగాడు నాయుడు గాభరాగా.

"నీకేం భయమొద్దులే. ముందుగా రంగుమారిన ఆకులుండే చెరుకులన్నీ పెరికేసి కాల్చేయి. చెరుకు చూస్తాంటే నాటి రెండు నెల్లు అయినట్లుండాది. ఇప్పటికే లేటు చేసినావు. సాయంత్రమే పీలేరుకుపో. లిండెన్ మాత్రలని అమ్మతారు. అయ్యి ఎకరాకు ఎనిమిది కేజీలెయ్యాల. మామూలుగా అయితే చెరుకు నాటిన నెలకు ఒకటిన్నర నెల్లకు, రెండు నెలలకు ఎయ్యాల. అట్ల ఏసింటే ఇప్పుడది వచ్చిన్నిండదు. ఇప్పుడయినా తెచ్చి ఎయ్యి" అన్నాడు మందు వేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ...

ఏదో ఆలోచనలో పడినట్లుగా తల గీరుకుంటున్న సురేంద్రనాయుడుతో-

"నువ్వెప్పుడూ ఇంతే. ఏదన్నా చెప్తే బలే తాస్కారం చేస్తావు. ఇప్పుడు పాలు మాలినావంటే పంటంతా నష్టపోతావు. మందు తెచ్చినాక చెరుకు కుదుళ్ళకాడ తడులు దగ్గరదగ్గరగా పారాల. అట్లే.... చెరుకుపిప్పి ఉంటే కాలవంతా పరిచినావంటే పారే నీళ్ళతడి తొందరగా ఆరదు" అన్నాడు మందువాడే విధానాన్ని తెలియజేస్తున్నట్లుగా.

"లేదులేన్నా. ఎనకంటీనే మందులు తెచ్చి ఏసేస్తా. ఇంతకు ముందు నిన్ను చూసి కనకాంబరం ఏస్తి. ఇసక నేలలో కనకాంబరం పంట బాగరాదని నువ్వు చెప్పినా ఇనిపించుకోలా నేను. ఫలితం అనుభవించినాను గదాన్నా" అంటూ కరెంటు పోవడంతో కాలవలోని నీళ్ళలో కాళ్ళు చేతులు కడుక్కోసాగాడు సురేంద్ర నాయుడు.

జయచంద్రారెడ్డి పక్కనే ఉన్న కానగ చెట్టుకింద వేసిన బండమీద కూర్చున్నాడు. తనలో తనే బాధపడుతున్నట్లున్న జయచంద్రారెడ్డి ముఖాన్ని పరిశీలనగా చూసిన సురేంద్రనాయుడు, తనూ బండమీద కూర్చుంటూ..

"వచ్చిన పనేమన్నా" అడిగాడు.

చెప్దామా వద్దా అని కొంతసేపు తటపటాయించి చివరకు చెప్పడానికే నిర్ణయించుకొని-

"నీకు తెలీందేముంది నాయుడు. నా వ్యవసాయం చూస్తాందావు గదా. వచ్చిన పంటను అమ్మబోతే అడవి. దానికి కావలసిన ఎరువులు కొనబోతే కొరివి. అప్పటికీ తలలు తాకట్టు పెట్టయినా ఎరువులు తెచ్చి అదునుకు పండిస్తా ఉండానా. వచ్చేది మాత్రం మూతికి ముడ్డికి గూడా చాలడంలేదు. పెద్ద రైతనే పేరు తప్పిస్తే నాకు మిగిలిందేమీ లేదు. ఇరవై సంవత్సరాలుగా సేద్యం చేస్తాందా. ఎన్నో ఇబ్బందులు పడినా. మంచి మాటగాడు, సేద్దిగాడు పేర్లతో పాటు అప్పులూ సంపాదించుకొన్నా. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పంటలో లాబం ఉంటుందని ఆశపడేది. తీరా చూస్తే అప్పు తీరేదిలే ఏమీలే. ఇంగో కొత్త అప్పు. కాలం ఇట్లే పోతాంది. కొడుకులిద్దరూ చదవతాండారు. వాళ్ళను చదివించే స్తోమత గూడా లేదిప్పుడు. చదువాపిస్తే పరువుండదని చదివిస్తా ఉండాను" అని మాటలు ఆపాడు, అలుపు తీర్చుకోవడానికన్నట్లుగా.

"నిజమేన్నా... ఇంతకు ముందు నువ్వు బయటకు ఎలబారినావంటే రెండు చేతలకు రెండేసి ఉంగరాలు, మేలురకం జరీ అంచు పంచె, సిల్కు చొక్కా, టర్కీ టవలు అత్తరు వాసన, తిరగడానికి 'రాజదూత్' మోటారు సైకిలు... పూలరంగడి మాదిర్తో ఉంటివి. ఇప్పుడు చూడు ఏ పరిస్థితికి వొచ్చినావో. నువ్వొగనివే కాదులే. ఎవసాయాన్ని నమ్ముకున్నోళ్ళు చానా మంది అప్పుల పాలయిపోతాండారు" అంటూ సురేంద్రనాయుడు జేబులోంచి బీడి కట్ట తీసి జయచంద్రారెడ్డికి ఒకటివ్వబోయాడు.

"అన్నీ పోయినా సిగరెట్టును మాత్రం వదల్లేకుండా ఉండాను నాయుడు" నవ్వుతూ అని జేబులోంచి సిగరెట్టు ప్యాకెట్టు తీసి ఒకటి వెలిగించాడు.

తిరిగి జయచంద్రారెడ్డి కొనసాగిస్తూ "ఇంతకు ముందు టమాటాలు నాలుగెకరాలు ఏసినా, కష్టం పోంగా ఏమీ మిగల్లా. తిన్నకాడికి దక్కోలంతే. నిరుడంటే ముందుగా ఏసేసి రేటు లేకుండా పోయింది. ఈసారి ఒక నెల ఎనకేసినా ఇప్పుడిప్పుడే రేటు వస్తాందంట. పది ఎకరాలు గుత్తకు తీసుకొని మొత్తం పద్దైదెకరాలు ఏసినా. పూతా పిందే బాగా పట్టినాయి. ఇప్పుడున్నట్లే ఉంటే అప్పులన్నీ ఈ దెబ్బతో ఎగిరిపోతాయి" అన్నాడు ఆశావహంగా జయచంద్రారెడ్డి.

చివరి మాటలు అంటున్నప్పుడు అతని ముఖంలో అలల్లా కదలాడిన వెలుగు రేఖల గమనిస్తూ-

"నిజమేనంటన్నా. మీతోట బాగుందని మాఊర్లో వాళ్ళు చెప్పినారు. వచ్చి చూద్దామని అనుకొంటానే ఉండా. తీరికలే. కష్టానికి ఫలం తప్పకుండా ఉంటాదిలే" అన్నాడు సురేంద్ర నాయుడు.

"ఇప్పుడుండే పూతా పిందే నిల్చాలంటే మందులు ఎయ్యాల. దానికి దుడ్డు కావాల. ఊర్లో ఇద్దరు ముగ్గుర్నడిగి చూసినా. కుదర్లా. ఒకడేమో సందేళరా, పద్దన్నేరా అంటాండాడు. ఇస్తాడనే నమ్మకం లేదు. ఒకేళ మల్లెప్పుడో ఇచ్చినా, మందులేసీ సుఖముండదు. అదేదో చెప్తారే, అదునూ పదునూ లేకపోయినా నామొగుడు రాజ సేద్దిగాడు అని. అట్లవుతుంది కథ" అన్నాడు జయచంద్రారెడ్డి వచ్చిన కారణం చూచాయగా తెలుపుతూ.

"ఇప్పుడెంత కావాలన్నా" అడిగాడు సురేంద్ర నాయుడు.

"నా దగ్గర కొంతుంది నాయుడు. ఇంకా పది వేలు కావాల. నిన్ను అడగదామనే వచ్చింది. నువ్వూ మందులు కొనాల గదా..." అంటూ అర్థోక్తిగా ఆపేశాడు.

"నేనిస్తాన్లే" అన్నాడు సానుభూతి నిండిన గంభీర స్వరంతో.

"అంత దుడ్డు ఎట్ల చేస్తావు నాయుడు" అని అడిగాడు ఆశ్చర్యంగా.

"ఆరెకరాలు చెరుకేసినా, పదెకరాలు చేను కొన్నే. భార్యకు నగలు చేయించినా. ఇదంతా నీచలవే గదన్నా. అట్లాంటప్పుడు అవసరంలో నీకు ఈకుంటే ఎట్లా" అన్నాడు ఆవేశంగా సురేంద్ర నాయుడు.

"నా చలవా....?! నేనేం చేశాను" అన్నాడు ఆశ్చర్యంగా.

"నువ్వు మరిచిపొయ్యినావేమో. నేను మరిచి పోలేదన్నా. పద్దైదు సంవత్సరాల ముందు బాయి దగ్గర ఎకరా, చేను మూడెకరాలుండేది. ఆ ఎకరంలో నీళ్ళున్నెప్పుడు వడ్లగింజలు లేదంటే ఎలి పంటలు. వానొస్తే చేన్లో వేసే చెనిక్కాయల్తో వచ్చే వరుమానం. 'గొర్రె తోక బెత్తెడు' మాదిర్తో ఉండేది. అప్పటికి ఈ చుట్టుపక్కల ఎవ్వరికీ తెలీని పంట పట్టుపురుగుల మేపేది తొలీగా ఏసింది నువ్వే. చుట్టు పక్కల పల్లెల నుంచి పట్టు పురుగుల చూడను అదేపనిగా వచ్చేవాళ్ళం. అయ్యి చంద్రింకల్లో వాటి చుట్టూ దారాన్ని అల్లుకుంటా గువ్వ గుడ్డు మాదిర్తో తయారవతాంటే ఆశ్చర్యపోయేవాళ్ళం. వాటిల్తో పట్టు గుడ్డలు తయారు చేస్తారంటే ఎవురూ నమ్మలా అప్పట్లో. నీ దగ్గర మంచీ చెడ్డా కనుక్కొని అందరూ దానికే

మళ్లిరి. దాంతోనే చానామంది సంపాదించుకొండ్రి. అట్లావోల్లల్లో నేనూ ఒకడ్ని. అద్దో.. కరెంటు వచ్చిందన్నా. మిషనేసొస్తా" అంటూ షెడ్డువద్ద బల్బు వెలగడంతో వెళ్ళాడు నాయుడు.

"మీకందరికీ లాబాలు వచ్చినాయి గానీ నేను పదిసార్లు పంటబెడితే ఎనిమిదిసార్లు నష్టపోతి. అట్లయితే ఎట్ల చెప్పు తట్టుకొనేది" అన్నాడు ఁయచంద్రారెడ్డి తిరిగొచ్చిన సురేంద్రనాయుడుతో.

"అదంతా టైములేన్నా. నువ్వేగాదు చాలామంది దెబ్బతిన్నోళ్లుండారు. అదొదిలేసి చెరుకేస్తివి. అంతకు ముందు మనోల్లకు చెరుకు పండించడం తెలీదని కాదు. నువ్వు కొత్త కొత్త గవుర్మెంటు ఎరువులేసి కరెంటు పోల్లు కన్పించనంత ఎత్తు చెరుకు పెరిగేటట్లుగా చేస్తివి. నెలల తరబడి గొడ్లతో గానుగాడే బాధ తగ్గించి క్రషర్ తెస్తివి. అదొచ్చాలకు పని చానా సులువయింది. చెరుకులో మంచి ఆదాయం ఉండడంతో చానామంది రైతులు దానికీ మళ్లిరి. ఇంకా ఎంతోమంది అదే పంట బెడ్తాండారు. నేను గూడా.

అయ్యి రెండేనా. పొద్దు తిరుగుడు, కనకాంబరాలు, ఉల్లగడ్డలు, నిమ్మతోట, తొలిగా ఏసింది నువ్వే కదా. టమేటా.. అంతకు ముందు ఇంటివాడిక్కోసం, లేకపోతే వారానికి ఏ పదో పరకో వస్తాదనో ఐదో పదో కుంటల నేలల్లో పండించేవాళ్ళు. ఇప్పుడు? నువ్వు ఎకరాలెకరాలకు పండిస్తాండావు. నిరుదు మాపల్లెలో సిద్దయ్య నిన్ను చూసి ఎకరా నేలలో టమేటా ఏసె. నికరంగా కుంటకు ఎయ్యి లెక్కన నలభైవేలొచ్చి వాడికుండే అప్పులన్నీ ఎగిరిపాయ" ప్రవాహంలా సాగి పోతున్నాయి సురేంద్రనాయుడి మాటలు.

"ఇంతకు ముందు వానొస్తే చేన్లకాడ, నీళ్లుంటే బావల కాడ సేద్దం చేసేవాళ్ళం. ఇప్పుడు సంవత్సరమంతా పనులుండే పంటలను దుడ్డొచ్చే పంటలను నేర్పించినావు. నేను బాగుపడిందానికి కారణం నువ్వేగదన్నా. అందుకనే నీకు సాయం చేస్తానంటాండేది" అన్నాడు సురేంద్రనాయుడు.

"అదంతా మీ అదృష్టం నాయుడు. చానామంది నష్టపోయిండ్లా. ఎవురో ఎందుకు నన్ను చూడు. నేను నిండా అప్పుల్లో మునిగిపోయినానే" అన్నాడు దిగులుగా.

సురేంద్రనాయుడు కొంతసేపు మౌనం తర్వాత-

"నువ్వు వినే వుంటావు. ఒకరిద్దర్ని చంపందే డాక్టర్ కాలేడనే సామెత. ఇక్కడ మామూలుగా పండించే వరి, చెనిక్కాయల గురించి ఏరైతు నడిగినా ఏ కార్తెలో ఇత్తనమెయ్యాల, ఎప్పుడు నాటాల, ఏ రోగానికి ఏమందెయ్యాల అనేదంతా చెప్తారు. ఈ కొత్త పంటలు పెట్టినప్పుడు ఎప్పుడు ఏ రోగాలొస్తాయో, వచ్చినా వాటికి ఏమేం మందులెయ్యాలో అనుభవం ఉంటే తప్ప అర్థం కాదు. నువ్వు ఒకటి రెండుసార్లు పంట బెడతావు. ఒకసారి అనుభవం లేకో రెండోసారి వానల్లేకో, రేటులేకో నష్టం వస్తుంది. అప్పటికి నువ్వు ఆపంటను ఎప్పుడు పైరు చెయ్యాల. ఏరోగమొస్తే ఏం మందెయ్యాల అనేది బాగా తెలుసుకొంటావు. నువ్వు పడిన బాధలను అడిగినోళ్ళకు వివరంగా చెప్తావు. నువ్వు మాత్రం దాన్ని వొదిలేసి ఇంకోదానికి పోతావు. అక్కడా మామూలే. మేమెవరన్నా చెప్పినా ఇనిపించుకోవు. నువ్వు అప్పుల్లో మునిగిపోతాండేది అందుకే. కష్టమో, నష్టమో ఒకేదాన్ని పట్టుకోని పాకులాడతాన్నిందానికి అంతో ఇంతో సంపాదించుకొంటాండాము" అన్నాడు వివరిస్తున్నట్టుగా.

"నువ్వు చెప్పిందీ నిజమేనేమో నాయుడు- పొద్దు తిరుగుడు ఏస్తి. మొదలు కుళ్ళురోగమొచ్చె. అప్పటికి దాని గురించి తెలిసినోళ్ళెవరీడ? నానా తంటాలు పడి తెలుసుకొని మందులు తెచ్చి ఏసినా ఫలితం లేకపాయ. నన్నడిగి మా ఊర్లో గోవిందు సాగుచేసె. బాగా సంపాదించుకొండె. ఒగోరి తలరాత ఒక్కో మాదిర్తో ఉందాది. ఇంగ ఈ టమేటాను నేను కూడా వదలను. అంతు తేల్చిందాకా అదే పంట ఏస్తా. దుడ్డుకు ఎప్పుడొచ్చేది నాయుడు" అనడిగాడు లేస్తూ.

"...నువ్వెందుకులేన్నా. రేపు నేనే వస్తా. ఒకసారి తోట కూడా చూసినట్లు ఉంటుంది" అన్నాడు సురేంద్రనాయుడు.

"ఏం రాఘవా... పద్దన్నే వచ్చేసినావే" అనడిగాడు జయచంద్రారెడ్డి భోజనం చేసి చేయి తుడుచుకుంటూ ఇంటి ముందుకొచ్చి.

"యాడికీ రాకుండా ఇంట్లోనే ఉండి, అన్నీ జరిపించుకోను మేమేమన్నా మీమాదిర్తో షావుకార్లమా" అన్నాడు రాఘవ నవ్వుతూ.

"ఎవురు షావుకార్లు. ఎవురు బీదోళ్ళు. అందరి పరిస్థితి అంతేలే" అన్నాడు.

రాఘవ పుట్టుకతో తెలుపయినా నిత్యం ఎండలో పని చేస్తుండడంతో నలుపు రంగుగా మారాడు. వయసు దాదాపు జయచంద్రారెడ్డికి అటూ ఇటుగా ఉంటుంది. అతని కండ్లు లోతుకు పోయి, శరీరం మొత్తం ఎముకలకు చర్మాన్ని అతికించినట్లుగా ఉండాడు. మాసిపోయిన పంచె, చిరుగులు పడిన తెల్ల చొక్కా వేసుకోనున్నాడు. జయచంద్రారెడ్డి అరుగు మీద కూర్చున్నారిద్దరూ.

"పదివేలు కావాలన్నా" అన్నాడు రాఘవ ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానె.

"పది వేలా!" అన్నాడు జయచంద్రా రెడ్డి అతను నోట్లో పెట్టుకోబోతున్న సిగరెట్టు ఠక్కున కింద పడింది.

"అవును రెడ్డీ నిండా అవసరం"

"నా దగ్గర యాడుంది రాఘవా. నేనే అప్పుల్లో ఉంటే"

"అప్పులు నీకెందుకుండాయి. నువ్వెన్నెన్ని రకాల పంటలు పండిస్తాండావు. నీగ్గూడా అప్పులా?" అన్నాడతను.

అతను తనను ఎగతాళి చేస్తున్నాడో పొగుడుతున్నాడో అర్థం కాలేదు జయచంద్రారెడ్డికి.

"ఇప్పుడంత అవసరమేమొచ్చింది"

"మా కొడుకు పొగాకు ఏస్తాడంట బాయికాడ... దానికి గావల్ల"

తనమీద పిడుగు పడినంతగా ఉలిక్కి పడ్డాడు జయచంద్రారెడ్డి.

"మీ కొడుక్కేమన్నా పిచ్చా. ఈ పక్కన పొగాకు యాడ పండుతుంది" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకు పండదు? ఇంతకు ముందు ఎప్పుడూ లేని కొత్త కొత్త పంటలన్నీ నువ్వు పండిస్తాంటే, ఇది మాత్రం ఎందుకు పండదు. దీన్నే పండించాలంటాండాడు నా కొడుకు".

"అది మన పక్క పండదు. మీ కొడుక్కు చెప్పు. టమేటా ఎయ్యండి. నిరుడు కంపల్లెలో సిద్దయ్యకు ఎకరా నేలలో నలభై వేలొచ్చిందంట..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు జయచంద్రారెడ్డి.

అతని మాటలను మధ్యలోనే ఆపుతూ రెండు చేతులెత్తి నమస్కారం చేస్తూ-

"నీ సలహాలకు, నీ పంటలకు దండం సామీ" అన్నాడు రాఘవ. తిరిగి తనే కొనసాగిస్తూ-

"నీకు గుర్తుంది గదా రెడ్డీ పదైదు సంవత్సరాల ముందుమాట. అప్పుడు నువ్వు పట్టు పురుగుల మేపితివి. వేలకు వేలు లాభాలు చూపిస్తివి. దాని మోజులో పడి తెలిసిన పంటలొదిలేస్తిమి. తొట్ట తొలీగానే నాసిరకం గుడ్డు ఇచ్చినారు. వాటినుంచి పిల్లలు వచ్చింది తక్కువ. ఆ వచ్చిందేటియి బాగానే ఉన్నేయి. రెండు మూడు దినాల్లో గూళ్ళు అల్లతాయనంగా ఏందో మాయదారి రోగమొచ్చి సగానికి సగం పాయ. రెండు మూడేండ్లు చేస్తి. ఒకసారి గుడ్డు తెచ్చినాంక ఆక్కేదో రోగమొచ్చె. ఆపురుగులేమన్నా గొడ్లా.. వరిగడ్డి, ఉట్లగెడ్డి తినేదానికి... ఒకసారి మాత్రం పంట బాగానే వచ్చింది. మదనపల్లెకు ఏసుకోనిబోతి. రేటులే. అట్లే చింతామణికి పోతి. ఆడా మదనపల్లోళ్ల తల్లో దూరిపొయ్యేటోళ్ళు. 'దరిద్దురినికి యాడికి పోయినా వడగండ్ల వానే' గదా. అన్నే ఉంటి. ఆ దొంగ నాయాండ్లు నాలుగురోజులు నిలిపేసిరి. మల్లెపుడో తూకమేస్తే ఏముండాది. తూకం తగ్గిపాయ. ఇన్నూరు కేజీలయి నూటేభై కొచ్చె. మీరేందో మోసం చేస్తాండారని వాళ్ళపైన కొట్లాడితి. వాళ్ళదేముందిలే, దాన్ని నమ్ముకోవడం నాతప్పు. మూడేండ్లలో మొత్తం నష్టమే. ఒక్క రూపాయి గూడా కండ్ల జూల్లా" అన్నాడు రాఘవ.

"అది నీ దురదృష్టం రాఘవా. దానికి ఎవురేం చేస్తారు చెప్పు. నాకు తొలీగా రెండు పంటలే బాగొచ్చింది. మల్లా..? అదంతా టైము." అన్నాడు జయచంద్రారెడ్డి నిర్లిప్తంగా.

"అదంతా మా గాచారంలే రెడ్డి. అదట్లున్నీ నిన్ను చూసి నేనూ చెరుకేస్తి. బిన్నే పనయిపోతాదని ఇరవై వేలిచ్చి క్రషర్ తెస్తి. గానుగాడేదానికి ఐదారు మంది కూలోల్లను బెట్టి చెరుకంతా కొట్టి పెడ్తే కరెంటు పోతుంది. కోటా పద్దతంట. రోజుకు నాలుగైదు గంటలే. ఆ కరెంటు నాయాండ్లకు రోజుకు నాలుగైదు మెతుకులు పెడితే తిని బతకతారేమో చూడాల. అదీ గంటకు నాలుసార్లు ఆపయి వస్తుంది. అట్లయితే క్రషర్ ఉంటే లాభమేమి. అదీ రిపేరొచ్చె. దానికి మెకానిక్కు దగ్గరికి రెండు రోజులు తిరిగితి. వాడొచ్చి మూరెడు పొడుగు లిస్టు రాసిచ్చి పాయ. ఆ సామాన్లు రెండు వేలాయ. వాడు వారంరోజులు తిరిగినాడు. ఒగరోజు స్పానర్ లేదంటాడు. ఇంగోరోజు నట్టు లేదంటాడు. ఇంగోరోజు దీనికిది సెట్టు కాదంటాడు. మనకు తెలీదు కదా దాని గురించి. వాడు చెప్పింది నమ్మాల. ఎప్పుడో బాగు చేసె. ఈరోజవుతుంది రేపవుతుంది అని కాసుకోనుంటిమి గదా. కొట్టిన చెరుకు ఎండిపాయ మిగిలింది పండిపాయ. పంట రూపాయిలో పావలాభాగం గూడా రాలా. ఇంగోసారి పంట బాగొచ్చి బెల్లం బాగయింది. ఇంట్లో పెట్టుకోను జాగాలే. చిత్తూరు బెల్లం మండీకి ఏసుకోని పోతే రేటు లేదన్రి. మల్లా ఎనక్కు యాడ తెచ్చేది అని, శెట్టి దగ్గర పెట్టేసి పదివేలు తీసుకొంటి. అవసరం గదా. ఊర్లో చే బదుల్లకు ఈవద్దా. నెల నాటికి రేటు

తెంచుకొందామంటి. నెల నాటికి బోతే.., ఎండాకాలం బాయిలో నీళ్లు మాదిర్తో రేటు తగ్గిందే కాని పెరగలా." అన్నాడు చెరుకు ద్వారా పడిన కష్టాలను వివరిస్తున్నట్లుగా రాఘవ.

"ఆడికి నీ పనే మేలు రాఘవా. రేటు తక్కువయినా ఒగతెంచుకొన్నేవు. అంతో ఇంతో దుడ్డు చేతికొచ్చింది. ఈ కరెంటును నమ్మలేక నేను గానుగాడలా. చెరుకు పుంగనూరు షుగరు ఫ్యాక్టరీకి తోల్తి. నాలుగేండ్లయింది. ఇంగా దుడ్డు పూర్తిగా ఈలా. నాబాధ ఎవురితో చెప్పుకోవాల" అన్నాడు జయచంద్రారెడ్డి.

"మీకేం రెడ్డీ బూములు దండిగా ఉండేవోల్లు. ఇంగ నాలుగేండ్లకు ఇచ్చినా బాధలేదు. మా యట్లా సన్నా బన్నోళ్ళకు ఎప్పుడిదప్పుడు రాకుంటే బతికేదెట్లా. నీకూ నష్టం వస్తాన్నే కొత్త కొత్త రకాలు పెట్టేది వదల్లేదే నువ్వు. రెండెకరాల నేలలో నిమ్మ చెట్లు పెడ్తివి. ఇదేందో బాగుందే ప్రతి సారీ సాలు దున్నాల. దుక్కి చెయ్యాల. గింజలెయ్యాల. గుంటకల్తోలాల అనే ఇబ్బందుండదని నేను గూడా ఏస్తి. అదేదో చెప్తారే ఆశకు పోతే గోతిలో రాయి పడతాదంట. అట్లయిపాయ. మూడేండ్లకు కాపుకొచ్చె. కాసిన కాయలన్నీ ఈ సుట్టు పక్కల సంతల్లో అమ్ముడు పోలా.

పీలేరుకో, తిరుపతికో తీసుకొని బోతే ఆడ లోల్లు లోల్లు... ఈటిని అడిగే మొగోడేలే. యాడ పడి సావమంటావో చెప్పు" అన్నాడు రాఘవ కాస్త కోపంగా.

అతడు తననే నిలదీస్తున్నట్లు అన్పించింది జయచంద్రారెడ్డికి. పదిహేను సంవత్సరాల క్రితం అన్న దమ్ములు వేరు బాగాలు పోయినప్పుడు అన్న కన్నా బాగ బతకాలన్న ధ్యాసలో పడి రకరకాల పంటలు సాగు చేసి తప్పు చేశానా అని మొదటి సారిగా ఆలోచించాడు జయచంద్రారెడ్డి.

"నువ్వే కాదులే. నేను మాత్రం ఎన్నిసార్లు నష్టపోలేదు చెప్పు. అరిటి పెడ్తి. ఎకరాకు యాభై వేలొస్తాదని. తీరా ఐదు వేలు గూడా రాలా. దానికి ఎన్ని రకాల రోగాలయితే ఉండాయో అన్నిరకాలూ వచ్చె. ఆ మాదిగా అయితే ఎవురయితే మాత్రం బాగు పడతారు చెప్పు. పొయ్యినోటియి పొయ్యినాయి. ఇప్పుడు టమేటా ఏస్తాందావు గదా. బాగు పడతావులే" అన్నాడు జయచంద్రారెడ్డి.

ఆ మాటలకు రాఘవ పిచ్చి పట్టిన వాడిలా గట్టిగా నవ్వాడు.

"అదీ అనుభవించినాను గదా. తొలీ సారి ఏసినప్పుడు రాయచోటిలో కేజీ పద్దైదు నూర్లిచ్చి ఇత్తనం తెస్తి. చెట్లు బాగా పెరిగినాయి. ఈసారి కాపు బలే ఉంది. అనుకొంటి. పూతేలే. గొడ్రాలి మాదిర్తో బలంగా ఉండాయంతే. అంగటోడు మోసం చేసె. రొండోసారి వేస్తే పూత చెట్లే కన్పించనంతగా పట్టింది. కానీ కాయ చిన్నది. ఎవరు కొంటారు? ఎన్ని కోస్తే గంపకయ్యేది. తలకు మించిన అప్పులయిపాయ" అన్నాడు రాఘవ తను టమేటా ద్వారా కూడా నష్టపోతున్నట్టుగా.

"నాసిరకం ఇత్తనాలు తెచ్చి ఏస్తే ఇంగెట్ల ఉంటాది పంట అట్లగాక. నేను గూడా ఇకసారి మోసపోలా. వర్షాకాలమయితే ఒకరకము, ఎండాకాలమయితే ఇంకోరకం, చలికాలమయితే ఒకరకం - అట్ల మూడు రకాలుండాయి ఇత్తనాలు. చలికాలంది ఎండాకాలంలో ఏస్తే పనికిరాదు. మంచి ఇత్తనాలయినా ఎప్పుడేది ఎయ్యాల్నో అప్పుడే

ఎయ్యాల" అన్నాడు జయచంద్రారెడ్డి తను చేస్తున్న పంటలను సమర్థించుకోడానికన్నట్లుగా. కానీ రాఘవ చెబుతున్న ప్రతి విషయము అతడి గుండెను మెలి పెడుతోంది.

"ఆc.. నువ్వు చెప్పినట్లు మంచి ఇత్తనాలే, అదునుకే తెచ్చి ఏస్తి. దానిక్కావలసిన ఎరువులకు దుడ్డులే. అప్పో సప్పో చేసి పంట బెట్టిననుకో. రేటు లేక దాంట్లో వచ్చింది వడ్డీలకు చాల్లా. ఇదంతా ఎందుకు చెప్తాండానంటే నువ్వా-కొత్త రకం పంటలు పండిస్తావు. నువ్వు నష్టపోయింది గాక మమ్మల్ని నష్టపోయేటిగా చేస్తావు. నిన్ను చూసి, నీ మాటలిని ముక్కుల్లోతు అప్పుల్లో మునిగి పోయినా. నేనొగన్నే కాదు. మా పల్లెలో రెడ్డెప్ప, పక్క పల్లెలో వెంకట్రమణ, గోవిందుడు... చానా మందిలే. నువ్వీ పంటలు ఎయ్యకుండా ఉన్నింటే బుద్ధిగా ఏ సద్దలో, రాగులో, చెనిక్కాయలో పండించు కొంటా... మూడు పూటలా లక్షణంగా తింటా ఉందుమేమో. అప్పులెక్కువయినాయి. మా కొడుకు మొన్న అదేదో ఊరికి పోయిన్నాడు. అడ పొగాకు ఏసి ఎకరాకు లక్షలు లక్షలు సంపాదిస్తాండారంట. అదేసి ఒకే సంవత్సరంలో అప్పులన్నీ తీర్చేయాలంటాండాడు. అందుకనే నీ దగ్గరకు దుడ్డుకోసరం వచ్చినా" అన్నాడు రాఘవ.

జయచంద్రారెడ్డి చాలా సేపు స్తబ్ధంగా ఉండిపోయాడు. అతడి మనసులో ఎన్ని దుఃఖ పర్వతాలు బద్దలౌతున్నాయో. పైకి మాత్రం నిర్వికారంగా ఉన్నాడు. అంతకు ముందురోజు సురేంద్ర నాయుడు మాటలు, ఇప్పుడు రాఘవ మాటలు అతడ్ని ఎంతగానో కలచి వేస్తున్నాయి. తనలా రాఘవలాంటి రైతులు కొత్త కొత్త రకాలు సాగు చేయడానికి ముందుకు వచ్చినప్పుడు ఇటువంటి ఇబ్బందులు పడుతుంటే పల్లెల్లో వ్యవసాయం ఎలా అభివృద్ధి చెందుతుంది? నాణ్యమైన విత్తనాలు రైతులకు లభించేటట్లు చూడాల్సిన బాధ్యత ఎవరిది? రైతు రెక్కలు ముక్కలయ్యేలా శ్రమించి సృష్టించిన పంటకు సరైనరేటు ఎవరిస్తారు? వ్యవసాయంలో నష్టపోతే ఆదుకొనేది ఎవరు? ఇలా పరి పరి విధాల పుట్టుకొచ్చే ప్రశ్నల ప్రవాహానికి సమాధానాలు చిక్కక అతని తల బరువెక్కింది.

ఎంతకూ జయచంద్రారెడ్డి మాట్లాడక పోవడంతో "ఎట్లయినా గానీ రెడ్డీ పదివేలు తీసీ. పొగాకులో లాభమొస్తాదని నాగ్గూడా నమ్మకముంది. సంవత్సరానికంతా వడ్డీ మొదలు ఇచ్చేస్తాం" అన్నాడు రాఘవ.

"లేదు రాఘవ. ఆ పంట ఈడ పండదు. మీకన్నా ముందే నాకూ ఆలోచన వచ్చింది. భూసార పరీక్ష చేయించినా అది ఇక్కడ పండదన్నేరు. ఇప్పటికే చేతులు కాల్చుకోనుండారు. ఒళ్ళంతా గూడా ఎందుకు కాల్చుకుంటారు. మీకు ఇవ్వాలన్నా నాదగ్గర దుడ్డు యాడుంది. నువ్వు చూస్తాండావు గదా. ఒకప్పుడు ఎట్ల బతికినోన్ని, ఇప్పుడు చూడు ఎట్లయిపోయినానో. టమేటా ఏసిండా. ఎరువులకు దుడ్డులేక కంపల్లె సురేంద్ర నాయుడ్ని పదివేలు అడిగినా. ఈ పొద్దు ఇస్తానన్నేడు ఆయన కోసం కాసుకోనుండా" అన్నాడు జయచంద్రా రెడ్డి.

కొంచేపు రాఘవ కళ్ళల్లో అపనమ్మకపు నీడలు. జయచంద్రారెడ్డి అబద్ధం చెప్పడనే నమ్మకముండడంతో-

"నిజానికి నాకీ సేద్దింపైన మనసు చచ్చిపోయింది రెడ్డీ. ఎవరన్నా కొనేవాళ్లుంటే చెప్పు అమ్మేసి పీలేరుకో, తిరపతికో పోయి యాపారం చేసుకొని బతుక్కొంటాం. వస్తా" అంటూ చిరుగుల టవలును భుజం మీద వేసుకొని వెళ్ళిపోయాడు రాఘవ.

కార్చిచ్చు తన చుట్టూ ఉన్న వాటిని కాల్చి వెళ్ళినట్లుగా అన్పించిందతనికి. అప్పటికే లోపలకు చేరిన ఆ వేడి తాలూకు సెగలు వైఫల్యాలను ఎత్తి చూపుతూ కార్చిచ్చులా మారి ధైర్యాన్ని చుట్టుముడుతున్నాయి.

పదిమంది కూలీలు టమేటాలు కోస్తున్నారు. కోసిన వాటిని కోసినట్లే చింత చెట్టుకింద సంచిపట్టల మీద వేస్తుంటే నలుగురు బుట్టలకు పేరుస్తున్నారు.

"రేటు బాగుందంట గదన్నా" అన్న పలకరింపుతో తల తిప్పి చూశాడు జయచంద్రా రెడ్డి.

"రా నాయుడు. యాడికి బోయిన్నావు" అంటూ పలకరించాడు జయచంద్రారెడ్డి.

అతనొచ్చి జయచంద్రారెడ్డికి ఎదురుగా కూర్చుంటూ-

"పెదినేకాలవపల్లెకు పోయింటన్నా. పండ్లు సైజు బాగుండాయే" అన్నాడు.

"ఆఁ మన రాతలు బాగుండద్దా" అన్నాడు జయచంద్రారెడ్డి.

"ఏమన్నా అంత యాస్టగా మాట్లాడతాండావు. రేటుందిగదా ఇంగా పెరగతాదంటావుండారు"

"పెరిగినా ఇంగ కాపు నెలకు మించి ఉండదు. నెలరోజుల పంట బీటికే పొయ్యిందనుకో" అన్నాడు.

"బీటికెందుకయిందన్నా... ఏదో ఒగ రేటు అమ్మతానే ఉండావుగదా"

"ఆ రేటు బతకనీదు సావనీదు. తొలీగా అయితే తిరపతికి తీసుకోనిబోతి. కూలీలకు, బస్సుల్లో ఏసిందానికి, దించిందానికి యాడజూడు చేతికర్చే. కండక్టరు.. రూపాయి టిక్కెట్టు ఇచ్చి ఐదు రూపాయలు తీసుకొంటాడు.. ఇదేమంటే 'నీకు తెలీదాయ్యా. ఈ రూటుకు కొత్తగా ఉండావే. నేనే మేలు. కొందరయితే పది రూపాయలు తీసుకుంటాండారు' అనె. ఆడ మార్కెట్టులో కొనేవాళ్ళందరూ ఒగటయ్యేది. అగ్గవగా కొనేది. యాడజూడు మనల్ను ఏమార్చే వాళ్ళే" అన్నాడు బాధగా జయచంద్రారెడ్డి.

"నిజమేన్నా... కలికిరికి ఏసుకోను పోయింటే దగ్గర గదా. లగేజీ తగ్గిందు" అన్నాడు సురేంద్ర నాయుడు.

"ఆడికీ పోయిన్నా... ఆడ కేజీ పావలా, పది పైసలు. చానామంది రైతులు వాటిని అమ్మను మనసు రాక రోడ్డు మీద పారేసి పోతాండారు. నేను గూడా రెండుసార్లు పారేస్తి. రోడ్డుమీద పండు టమేటాలు చూస్తాంటే అయ్యి మన మాంసం ముద్దల మాదిర్తో ఉండాయనుకో. వాటి మీద లారీలు, బస్సులు పోతాంటే నా ప్రాణం గిలగిల్లాడిందనుకో. మనమేం చేస్తాం చెప్పు. ఏ రాగులో, సద్దలో అయింటే ఇంట్లో పెట్టుకొని రేటున్నప్పుడు అమ్ముకోవచ్చు. ఇయ్యి అట్ల కాదుగదా" అన్నాడు జయచంద్రారెడ్డి.

"అవున్నా వాటిల్లో దుడ్డు రాదనే గదా మనం ఇయ్యి పంట బెడ్తాండేది. చెన్నయ్‌కి ఏసుకొని పోతాండావంటనే" అడిగాడు సురేంద్రనాయుడు.

"ఆc. యాడికి బోయినా ఏంలాభం. రామేశ్వరం బోయినా శనేశ్వరం పోలేదంట. ఒగో ఊర్లో రైతుల్ను ఒగో రకంగా మోసం చేస్తాండారు యాపారులు. చెన్నయ్‌కి లారీలు లారీలు వచ్చి దిగిపోతాయి. కొన్ని నూర్ల మైళ్ళ నుంచి వస్తాయి గదా. పండ్లు నలక్కుండా ఉంటాయా. వాళ్లు లారీలోంచి ఒక బుట్ట తీసి కింద కుమ్మరిస్తారు. ఒక్క పండు నలిగిన్నే పది కేజీల బుట్టలకు కేజీ తరుగు తీస్తారు. నూరు బుట్టలుంటే నూరు కేజీలు. మనం రేయింపగళ్ళు కష్టపడి పస్తులుండి పంటకు మందు మాకులేసి బాగా పంటబెట్టి మార్కెట్టుకు పోతే అడ మన కష్టాన్ని అన్నేయంగా కొట్టేసేవాళ్ళు ఎక్కువ. అయినా ఏం చేద్దాం. వ్యవసాయాన్ని నమ్ముకొనింది మన తప్పు. ఇప్పుడు రేటు సుమారుగా ఉందిలే. ఇదే మాదిర్తో ఉన్నే సగం అప్పులన్నా తీరతాయి" అన్నాడు జయచంద్రారెడ్డి తన బాధలను వివరిస్తున్నట్లుగా.

"ఒక్క టమేటా అనేగాదు. అన్నీ అట్లే అయినాయిలేన్నా. చెనిక్కాయలు చూడు నిరుడు మూట ఆరు నూర్లు. అదే ఈ తూరి నాలుగు నూర్లు. ఆ మాదిర్తో పంట రేటు దినదినానికీ దిగబడతాంటే ఎట్ల బతికేది. సరే నేవస్తాన్నా. తోటకు నీళ్ళు కట్టాల. పన్నెండు గంటలకు కరెంటు వస్తాది" అనేసి వెళ్ళిపోయాడు సురేంద్రనాయుడు.

పండ్లు కోయడం, బుట్టలకు పేర్చడం పూర్తయింది. లారీ కోసం ఎదురు చూడసాగారు. సాయంకాలానికి లారీ వచ్చింది. బుట్టలను లారీలోకి ఎక్కించి జయచంద్రారెడ్డి పెద్దకొడుకు కూడా వెళ్ళాడు.

అతను ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. సెలవులు. రెండు రోజుల్లో కాలేజీ ప్రారంభమవుతుంది. తను దగ్గరుండి అన్ని పనులు చూసుకోవాలి. అబ్బాయిని బాగా చదివించాలి. వాడికి తనలాంటి వ్యవసాయ జీవితం రానీరాదు అనుకున్నాడు జయచంద్రారెడ్డి.

ఇక ఇంటికి బయల్దేరుదామనుకుంటుండగా ఏదో శబ్దం వినిపించింది జయచంద్రారెడ్డికి. మొదట ఏదోలే అనుకున్నాడు. మళ్ళీ విన్పించింది. అది ఉరుముగా పోల్చుకున్నాడు. అతని మనసులో అలజడి. ఇప్పట్లో వర్షం వస్తే పంటంతా నాశనం అవుతుందే అని భయపడ్డాడు. చెట్టు కింది నుంచి పొలం గట్టు వద్దకు వచ్చి చుట్టూ కలయచూశాడు. దూరంగా ఈశాన్య మూలన మెరుస్తూ ఉరుముతోంది. ఆ మూల మెరుపు కనిపించిందంటే తప్పకుండా వర్షం వస్తుందని వాళ్ళ నమ్మకం. 'ఆc...ఎక్కడో దూరంగాలే' అని తనకు తనే ధైర్యం చెప్పుకున్నాడు జయచంద్రారెడ్డి.

ఇల్లు చేరుకున్నాడు. తోట దగ్గర్నుంచి ఇంటికి పదినిముషాల నడక. ఆ పది నిముషాల్లోనే అతడ్ని తరుముతున్నట్లుగా మేఘాలు వెనకే వస్తున్నాయి. ఇంటికి వచ్చాడే గాని ఆకాశం అంతా నిండుతున్న మేఘాలను చూసి జయచంద్రారెడ్డి మనసు ఆందోళనతో నిండసాగింది.

భోంచేసి మంచం మీద పడుకున్నాడు గాని నిద్ర రాలేదతనికి.

"అదును తప్పించి నెల ఎనక ఏస్తాండావు. అప్పటికి రేటు వచ్చినా వానలొచ్చి పంట నిలస్తాదంట్రా" అని తను టమేటా విత్తనానికి పోయినపుడే చెప్పిన నాగిరెడ్డి మామ మాటలు గుర్తొచ్చాయి జయచంద్రారెడ్డికి. అతనన్నట్లు వర్షం వస్తుందా. రాదులే, వస్తే... ఇలా ఆలోచిస్తుండగానే వర్షం ప్రారంభమయింది. పది గంటలకంతా కుండపోతగా కురవసాగింది. భార్య వద్దంటున్నా వినకుండా గొడుగు, టార్చి తీసుకొని తోట వద్దకు వెళ్ళాడు. వర్షపు చినుకులు గులక రాళ్ళలా ఎడా పెడా తగులుతున్నాయి. ఆరడుగుల అతని దేహానికి గొడుగు వలన ఒక్క అడుగు మాత్రమే ప్రయోజనం చేకూరుతోంది. అప్పటికే మోకాళ్ళ వరకు వస్తున్న నీళ్ల లోంచి మెల్లిగా తోట వద్దకు చేరుకున్నాడు. చీకటికి, చిక్కటి వలలా పడుతున్న చినుకులు తోడు కావడంతో టార్చి వెలుగు వెలవెలా పోతోంది. బారడు దూరంలో ఉన్నది కూడా స్పష్టంగా కన్పించడంలేదు. టమాటా చెట్లకు పందిళ్ళుగా పెట్టిన కర్రలు కొన్ని తమ కుదుళ్ళలోని మట్టి కొట్టుకు పోవడంతో నీళ్ళలో తేలుతూ అతని కాళ్ళను పరామర్శించాయి. వాటిని అనుసరిస్తూ టమేటాలు.

జయచంద్రారెడ్డి చెవిలో సురేంద్ర నాయుడు, రాఘవల మాటలు హోరుగాలికి మించి హోరుగాను, జోరు వానకు మించి జోరుగాను వినిపిస్తున్నాయి. తను వ్యవసాయంలో ఏయే ప్రయోగాలు చేసింది, దళారులు తమను ఏవిధంగా మోసం చేస్తున్నది, ప్రభుత్వం తమను ఎంతలా చిన్న చూపు చూస్తున్నది అంతా గుర్తుకొస్తాంది. ఆటు పోట్లను ఎదుర్కొని జీవించాలన్న విషయం మాత్రం గుర్తుకు రావడం లేదు.

రాను రాను అతని మెదడు మొద్దుబారి పోతోంది. ఆలోచనా జ్ఞానం నశించి పోతోంది. అంత వరకు తను పడిన బాధలు, ఎదుర్కొన్న సమస్యలే సుడిగుండాల్లా మెదులుతున్నాయి. వర్షం మీద కసి. తమ కష్ట ఫలాన్ని దోచుకొనే దళారుల మీద, పంటకు కనీస రేటును ఇవ్వలేని ప్రభుత్వం మీద కోపం, నిస్సహాయత కలసి అతడ్ని పిచ్చి పిచ్చిగా ఆలోచింప చేయసాగాయి. తుపాకీ ఎత్తుకుని ఎందర్నో కాల్చేయాలని, ఈ ప్రపంచానికి అంతా తానే రాజులా మారాలని, తనలా వ్యవసాయంలో నష్టపోయిన రైతులందరికీ చేయూత నివ్వాలని అనుకున్నాడు. ముందుగా అందుబాటులో ఉన్న వర్షం దురాగతాన్ని ఆపాలి అనుకుంటూ

"ఏయ్... ఆగే...మాతోట మీద పడద్దు. టమేటాలు పగిలి పోతాయి. పోయే....పో... రాఘవా, వెంకట్రమణా, గోవిందూ, నాయుడూ... రండిరోయ్.. అందరూ రండి. వానను ఆపండి" అని అరుస్తూ చేతి లోని గొడుగుతో వర్షపు చినుకులను కొట్టసాగాడు. •

*కథా ప్రహేళిక, రచన ఇంటింటి పత్రిక సెప్టెంబరు 2002*